క్లుప్తంగా

తాగునీటి ఎద్దడిపై ముందస్తు ప్రణాళిక

ఉప్పలగుప్తం: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్త కుండా గ్రామాల్లో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి అధ్యక్షతన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పార్థసారథి మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అవసరమైన చోట్ల ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి, సర్పంచ్‌లు కుంచే బుల్లియ్య, పెయ్యిల రాజ్‌కుమార్, యర్రంశెట్టి రామచంద్రరావు, కుంచే చిట్టి కుమారి, కుంచే గౌరీ, చిక్కం పెదబాబు, నల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొండాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ


ముమ్మిడివరం కొండాలమ్మ అమ్మవారు

ముమ్మిడివరం: ముమ్మిడివరం కొండాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ జి.లోవరాజు, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, గంటి హరీష్ మాధురి, పెయ్యల చిట్టిబాబు, పెన్మత్స చిట్టిరాజు, చెల్లి అశోక్, వేగిరాతు రాజబాబు, గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కౌన్సిలర్ పెదబాబుకు సత్కారం


కౌన్సిలర్ పెదబాబును సత్కరిస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

అమలాపురం టౌన్: కౌన్సిలర్‌గా ఎన్నికై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక 24వ వార్డు కౌన్సిలర్ చిట్టూరి పెదబాబును ఆ వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, గృహ సారథులు శనివారం సత్కరించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడంలో ఆయన చేస్తున్న కృషిని అభినందించారు.

సత్తెమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ


సత్తెమ్మ తల్లి దర్శనానికి వచ్చిన భక్తులు

కాట్రేనికోన: కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని సత్తెమ్మ చెట్టు గ్రామంలో సత్తెమ్మ తల్లి నూతన ఆలయ, శిఖర, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. వేద పండితుల పర్యవేక్షణలో గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచకావ్యప్రాశనం, దీక్షాధారణ, అంకురార్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, సంసాని నాగేశ్వరరావు, సానబోయిన నాగేశ్వరరావు, వాసంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు రిమాండ్

ఐ పోలవరం: మండల పరిధిలోని మురమళ్లలో ఈ నెల 13న కాలేవారివీధిలో నివాసముంటున్న కాలే మణి కళావతి, చింతలపూడి గోగులమ్మలకు జ్యూస్‌లో నిద్రమాత్రలు కలిపి ఇచ్చి బంగారు ఆభరణాలు దోచుకున్న ఘటనకు సంబంధించి నిందితులను శనివారం పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ మేరకు ఎస్ఐ ఎస్.రాజేష్ శనివారం మాట్లాడుతూ కేసులో ముద్దాయిలు యానాంకు చెందిన జి.జగదీశ్వరి, ఉండ్రు దుర్గాప్రసాద్‌లను అరెస్ట్ చేసి ముమ్మిడివరం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని తెలిపారు.

మోటారు సైకిల్ ఢీ.. ఇద్దరికి గాయాలు

ముమ్మిడివరం: అన్నంపల్లి టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఈబీ అధికారుల జీప్‌ను మోటారు సైకిల్ ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాట్రేనికోన మండలం చెయ్యేరుకు చెందిన సుధా సుబ్రహ్మణ్యం తన స్నేహితుడితో కలిసి శుక్రవారం రాత్రి యానాం నుంచి మోటారు సైకిల్‌పై వస్తూ అన్నంపల్లి టోల్ గేటు వద్ద ఎస్ఈబీ అధికారుల వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో ఎస్ఈబీ ఎస్ఐ సామిరెడ్డితో పాటు మోటారుసైకిల్‌పై వస్తున్న ఓ యువకుడికి గాయాలయ్యాయి. ఎస్ఈబీ ఎస్ఐ సామిరెడ్డి ఫిర్యాదుతో ముమ్మిడివరం ఎస్ఐ కె.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యానాంలో భారీ వర్షం


భారీ వర్షానికి జలమయమైన పిల్లారాయ వీధిని పరిశీలిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి


ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద మోకాలు లోతులో వర్షపు నీరు

- పల్లపు ప్రాంతాల మునక
- పరిశీలించిన ఆర్ఏఓ మునిస్వామి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో శనివారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షానికి పలు పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. సుమారు మూడు గంటల పాటు నిరాటంకంగా కురిసిన వర్షానికి జనం అవస్థలు పడ్డారు. ముఖ్యంగా పట్టణ పరిధిలోని పిల్లారాయ వీధి, విష్ణాలయం వీధి, యుకేవీ నగర్ తదితర ప్రాంతాలు భారీ వర్షానికి జలమయమయ్యాయి. పలు డ్రెయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీరు నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో హెచ్ఆర్ స్క్వేర్ సిబ్బంది మురుగు కాలువల్లో చెత్తను తొలగించి మురుగునీరు ముందుకు కదిలేలా చర్యలు చేపట్టారు. ముంపుకు గురైన ప్రాంతాలను రీజనల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లారాయ వీధిలో నిలిచిన మురుగునీరును చూసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. భారీ వర్షం కారణంగా స్థానిక పిల్లారాయ ఆలయం చుట్టూ ముంపు ఏర్పడడంతో భక్తులు ఆలయంలోకి వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు.

చెరువుల పరిశీలన

యానాం నియోజకవర్గానికి తాగునీరు అందించే కీలకమైన 55 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రెండు మంచినీటి చెరువులను ఆర్ఏఓ మునిస్వామి పీడబ్ల్యూడీ అధికారులతో కలిసి పరిశీలించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

అకాల వర్షం... రైతులకు ఊరట

తాళ్లరేవు: గత నెల రోజులుగా సాగునీరు లేక అనేక ఇబ్బందులు పడుతున్న రైతులకు అకాల వర్షం ఊరట నిచ్చింది. శనివారం ఉదయం నుంచి కురిసిన ఎడతెరిపి లేని వర్షం కారణంగా పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా మండల పరిధిలోని పి.మల్లవరం పంచాయతీ శివారు ప్రాంతాలైన గ్రాంటు, పత్తిగొంది, రాంజీనగర్‌తో పాటు నీలపల్లి, చొల్లంగి పంచాయతీల్లో రైతులు సాగునీరు అందక శివారు ప్రాంత భూములు బీటలు వారాయి. దీంతో పలుమార్లు రైతన్నలు రోడ్డెక్కి ఆందోళన చేశారు. సాగునీటి సరఫరాకు అధికారులు చర్యలు చేపడుతుండగా, అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షాల కారణంగా వరిచేలు తడవడంతో రైతులకు ఊరట లభించింది. దీంతో రైతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. రెండు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు చెప్పడంతో కాలువల్లో నీరు పెరిగి సాగునీటి సమస్య తొలగిపోతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


యానాం స్టేట్‌బ్యాంక్ కార్నర్ వద్ద జలమయమైన వీధి


భారీ వర్షం కారణంగా నీట మునిగిన పిల్లారాయ ఆలయ ప్రాంగణం

వరిలో సస్యరక్షణపై రైతులకు అవగాహన


పొలంబడి కార్యక్రమంలో రైతులకు సలహాలిస్తున్న ఏఓ సత్యనారాయణ

అల్లవరం: వరి పంటను ఆశించే పురుగులు ఆకుచుట్టుపురుగు, కాండం తొలుచు పురుగు, సుడి దోమ నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ రైతులకు అవగాహన కల్పించారు. బెండమూర్లంకలో శనివారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పుల దృష్ట్యా రెండు రోజుల తర్వాత సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. వర్షాలు కురుస్తున్నందున ఆకుముడత పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు మోనోక్రోటోఫాస్ 1 ఎంఎల్, లేదా క్లోరిపైరిఫాస్ 2 ఎంఎల్ మందు, లేదా ఎసిఫేట్ 1.6 గ్రాముల మందుని లీటర్ నీటిలో కలిపి పైరు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ గుత్తుల శివమోహన్, వీఏఏ జిల్లి విజయలక్ష్మి, రైతులు ముత్యాల పార్థసారధి, గణేష్‌కుమార్, నాగభూషణం, స్వామి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు సీఎం రంగసామి ప్రకటించారు. శనివారం 2023–24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయన్నారు. రూ.11,600కోట్ల బడ్జెట్‌తో అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు. వ్యవసాయ రంగంపై అధికంగా దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాల కల్పన కోసం దశల వారీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్తగా పరిశ్రమల స్థాపనకు కేంద్ర ప్రభుత్వ సహాయంతో సతారపేటలో 750 ఎకరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఉపాధి కోసం మెడికల్ పార్క్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఆడశిశువులు పుట్టగానే వారి పేరు మీద రూ.50 వేలు జమ చేసే పథకాన్ని సక్రమంగా అమలు చేస్తామన్నారు. బడ్జెట్ అన్ని వర్గాలు లబ్ధి పొందాలన్న ఉద్దేశంతో తయారు చేసినట్లు చెప్పారు.

వెంకన్నకు పంచామృతాభిషేకాలు


మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి దంపతులకు తీర్థ ప్రసాదాలు అందిస్తున్న చైర్‌పర్సన్ వీరీతాదేవి

అమలాపురం టౌన్: శ్రావణ నక్షత్రం ఏకాదశి సందర్భంగా స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామికి శనివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని విశేష అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పెద్దింటి లక్ష్మీనరసింహాచార్యులు, పానింగపల్ల సూరిబాబు ఆచార్యుల ఆధ్వర్యంలో సుదర్శన హోమం జరిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రెడ్డి సత్యనాగేంద్రమణి దంపతులు శనివారం ఉదయం వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చైర్‌పర్సన్ నాగేంద్రమణి, సత్యనారాయణ దంపతులకు ఆలయ చైర్‌పర్సన్ వీరీతాదేవి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మహిళా సంఘాలకు రూ.1.2 కోట్ల నిధులు


ఆసరా లబ్ధిదారుల జాబితాను సర్పంచ్ నక్కా అరుణకుమారికి అందజేస్తున్న వీఓఏలు

అమలాపురం రూరల్: కామనగరువు గ్రామంలో మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకంలో 49 మహిళా సంఘాలకు కలిపి రూ.1.2 కోట్ల నిధులు విడుదలైనట్లు మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నక్కా అరుణకుమారి శనివారం తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 25న వైఎస్సార్ ఆసరా పథకం నిధులు విడుదల చేస్తారని ఆమె చెప్పారు. మహిళా సంఘాల సభ్యులకు బొట్టుపెట్టి ఆసరా మూడో విడత నిధులు విడుదలయ్యాయని వీఓఏలు తెలుపుతున్నారు. ఆ వివరాలను కామనగరువులో శనివారం సర్పంచ్ అరుణకుమారికి అందజేశారు.

టీడీపీ నాయకుల ఆందోళన

అమలాపురం టౌన్: నియోజకవర్గ టీడీపీ నాయకులు శనివారం ఉదయం స్థానిక గడియారం స్తంభం సెంటరులో విజయోత్సవం జరుపుకుంటున్న సమయంలో పట్టణ సీఐ పార్టీ కార్యకర్తపై చేయిచేసుకున్నారని ఆరోపిస్తూ నిరసనకు దిగారు. సీఐ క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. పట్టణ ఎస్ఐ జి.హరీష్‌కుమార్ పార్టీ నాయకులతో చర్చించారు. చివరకు పార్టీ నాయకులు నిరసనను విరమించి అక్కడ నుంచి నిష్క్రమించారు. నిరసన చేపట్టినవారిలో మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు, పార్టీ నాయకులు పెచ్చెట్టి విజయలక్ష్మి, పరమట శ్యామ్ తదితరులున్నారు. గడియారం స్తంభం సెంటరులో జన సందోహం ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఇక్కడ బాణ సంచా కాల్చవద్దని సీఐ దుర్గాశేఖరరెడ్డి ముందుగానే టీడీపీ నాయకులకు స్పష్టం చేశారు. అయినా కొందరు కార్యకర్తలు ఆర్టీసీ ప్రయాణికులకు దగ్గరగా బాణసంచా కాల్చుతున్న సమయంలో సీఐ వారిని అడ్డుకుని వారించారు. దీనిపై టీడీపీ నాయకులు సీఐకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళల నుంచి స్వచ్ఛ అవార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కమిషనర్ జి.లోవరాజు తెలిపారు. టాయిలెట్ నిర్వహణ, మురుగు నీటి శుద్ధీకరణ, తడి, పొడి చెత్త సేకరణ, చెత్త నుంచి సంపద తయారీ, సేంద్రియ ఎరువు తయారీ, సాంకేతిక వినియోగం వంటి వాటికి కృషి చేస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళా సమాఖ్య సభ్యులు, నాన్ గెజిటెడ్ ఆర్గనైజేషన్ మెంబర్లు, మెప్మా విభాగం సభ్యులు ఈ నెల 22వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవొచ్చన్నారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా అవార్డులు అందజేస్తామని చెప్పారు.

ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

అమలాపురం రూరల్: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న జరుగుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక యూటీఎఫ్ హోంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కేవీఎస్ జిల్లా కార్యదర్శి పచ్చిమాల వసంత కుమార్ మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న దేశానికి మోడీ ముప్పు అనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పి.బేబీ గంగారత్నం, జి.దైవకృప, విజయ, మణిమాల, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గో, వృషభ కల్యాణం

అమలాపురం టౌన్: లోక కల్యాణం, పశు సంపద వృద్ధి కోసం స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో గో, వృషభ కల్యాణం శనివారం ఉదయం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు పెద్దింటి సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో అల్లవరం మండలం గూడాల గ్రామానికి చెందిన వస్కా కృపానందం, నర్సమ్మ దంపతుల చేతుల మీదుగా కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ఐ.పోలవరం: అమలాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 12 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వి.విజయశ్రీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గేదెల్లంక, అన్నంపల్లి, చిన కొత్తలంక, ముమ్మిడివరం, పల్లంకుర్రు, కాట్రేనికోన, కాట్రేనికోన(వనచర్లవారివీధి), పశువుల్లంక, గోగుళ్లంక, ఎదుర్లంక, కేశనకుర్రు, గుత్తినదీవి గ్రామాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హత కలిగిన వారు ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవొచ్చని ఆమె తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందిస్తున్న దాత ప్రభాకరరావు

ఆలమూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి, ప్రాణాప్రాయ స్థితి నుంచి కోలుకున్న ఆలమూరుకు చెందిన రాపాక కిరణ్‌కుమార్‌కు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు బాధితుడి పరిస్థితి చూసి చలించి, ప్రమాదానికి కారణమైన వాహనదారులతో మాట్లాడి తగిన న్యాయం చేయాలన్నారు. అనంతరం కిరణ్‌కుమార్‌కు గ్రామ పెద్దల సమక్షంలో దాత ప్రభాకరరావు సమకూర్చిన ఆర్థికసాయం మొత్తాన్ని అందజేశారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మోర్తరాణి మిరియం జ్యోతి
- అధికారులు సమాచారం ఇవ్వడం లేదంటూ ఎంపీటీసీల మండిపాటు


మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ మోర్తరాణి మిరియం జ్యోతి తదితరులు

ఐ.పోలవరం: రానున్న వేసవిలో మండలవ్యాప్తంగా ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ మోర్తరాణి మిరియం జ్యోతి అన్నారు. ఐ.పోలవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని చెప్పారు. మండలంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు తమకు కనీస సమాచారం సైతం ఇవ్వడం లేదంటూ మండల పరిషత్ సమావేశంలో ఎంపీటీసీలు మండి పడ్డారు. సమావేశంలో టి.కొత్తపల్లి ఎంపీటీసీ కొమానపల్లి శ్రీనివాసరావు, కొమరగిరి ఎంపీటీసీ సఖిలే పద్మావతిలు అధికారులు పలు అభివృద్ధి పనుల విషయంలో తమకు సమాచారం ఇవ్వడం లేదని, అలాగే సమావేశాల్లో గతంలో అడిగిన వాటికి సమాధానం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టి.కొత్తపల్లి గ్రామంలో గుంతలు తవ్వారని వాటిని పూడ్చమంటే తాత్సారం చేస్తున్నారని, దీని వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక నాయకులు లేవనెత్తారు. కొమరగిరిలో హౌసింగ్ అధికారులు ఇప్పటివరకూ ఎటువంటి సమావేశాలు పెట్టడం లేదని, జగనన్న కాలనీల్లో అభివృద్ధిపై దృష్టి సారించడం లేదని ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశానికి 19 మంది ఎంపీటీసీలకు గాను కేవలం ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మహమ్మద్ రెహ్మతుల్లా, ఎంపీడీఓ ఏఎల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సాహస కానిస్టేబుల్ వీరబాబుకు సత్కారం


కానిస్టేబుల్ వీరబాబును సత్కరించి అభినందిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపార ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఆత్మహత్య కోసం గోదావరిలో దూకిన ఓ యువతిని సాహసంతో నదిలో దూకి రక్షించిన జిల్లా ఏఆర్ కానిస్టేబుల్ అంగాని వీరబాబుకు అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. స్థానిక కల్వకొలనువీధిలో జరిగిన ఈ సత్కార సభకు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ అధ్యక్షత వహించారు. పోలీసులు ప్రజల ఆస్తుల రక్షణ కోసమే కాదు ప్రాణ రక్షణకు కూడా సిద్ధంగా ఉంటారని కానిస్టేబుల్ వీరబాబు తన సాహసంతో రుజువు చేశారని తాతాజీ అన్నారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ వీరబాబుకు చాంబర్ తరపున రూ.5 వేల నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, చాంబర్ వ్యాపార ప్రతినిధులు సప్పా నాగేశ్వరరావు, కుప్పాల రామకృష్ణ, జనిపిరెడ్డి సురేష్, కట్టోజు సన్యాసిదాసు, కల్వకొలను బాబి తదితరులు పాల్గొన్నారు.

నేడు మహా పూర్ణాహుతి


అఖండ హోమం నిర్వహిస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: అమలాపురం విద్యుత్‌నగర్‌లోని ఆదిశేష నిలయంలో గౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో గతేడాది సెప్టెంబరు 26న ప్రారంభమైన వారాహి అఖండ హోమం శనివారం నాటికి 174వ రోజుకు చేరుకుంది. అహోరాత్రులు నిర్వహిస్తున్న అఖండ వారాహి హోమ మహా పూర్ణాహుతి 175వ రోజు ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హోమం కోసం దాతలు అరిగెల వెంకట నాగేశ్వరరావు రూ 8 వేలు, రుద్రంరాజు బంగార్రాజు రూ.5 వేలు, సలాది సాయిరాం రూ.3 వేలు విరాళాలను అందజేశారు. కార్యక్రమంలో నాగసాధకులు పోతురాజు రామకృష్ణారావు, కనకదుర్గ, శిరీష, చాగంటి ప్రసాద్, నందు తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ


పాఠశాలలో చిన్నారులకు బర్త్‌డే కేకు తినిపిస్తున్న పెయ్యల రమేష్

తాళ్లరేవు: హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా జిల్లా ఉపాధ్యక్షుడు, న్యాయవాది పెయ్యల రమేష్ పుట్టినరోజు సందర్భంగా సుమారు 100 మంది మానసిక దివ్యాంగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. శనివారం కోరంగి పంచాయతీ సీతారామపురంలోని రిలయన్స్ ధీరూబాయి ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్‌లో దివ్యాంగుల మధ్య రమేష్ పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. కార్యక్రమంలో కేంద్రం ఇన్‌చార్జ్ ఎంవీ గోపాల్, ఫిజియోథెరపిస్టులు శ్రీకాంత్, సత్తిబాబు, తాడి షణ్ముఖరావు, కొప్పుల శ్రీను, మోకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూమి రీ సర్వే వేగవంతం చేయాలి

- ఆర్డీఓ ముక్కంటి
- కొత్తపేటలో భూ నిర్ధారణ ప్రక్రియ పరిశీలన


కొత్తపేటలో రీ సర్వేపై సమీక్షిస్తున్న ఆర్డీఓ ముక్కంటి

కొత్తపేట: గ్రామాల్లో రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీఓ ఎం.ముక్కంటి రెవెన్యూ, సర్వే అధికారులు, సిబ్బందికి సూచించారు. కొత్తపేట గ్రామ రీ సర్వేకు సంబంధించి స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న భూమి నిర్ధారణ ప్రక్రియను శనివారం ఆర్డీఓ పరిశీలించారు. గ్రామంలో విస్తీర్ణం, దానిలో ప్రభుత్వ భూమి ఎంత? జిరాయితీ ఎంత? ఇంత వరకూ ఎంత మేర రీ సర్వే పూర్తయ్యింది? అనే వివరాలపై ఆరా తీశారు. మొత్తం 3,454 ఎకరాలు విస్తీర్ణ కాగా 650 ఎకరాలు ప్రభుత్వ భూములు, 2,854 ఎకరాలు పల్లం, మెరక జిరాయితీ భూమిగా గుర్తించినట్టు సర్వే సిబ్బంది తెలిపారు. రీ సర్వే వేగవంతం చేయాలని ఆర్డీఓ సూచించారు. కౌలు భూములకు సంబంధించి కౌలు రైతులు ద్వారా భూ యజమానులకు సమాచారం ఇచ్చి, ఆ భూముల కార్డులు పంచాయతీలో సమర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పలువురు భూ యజమానులు తమ భూ సమస్యలకు సంబంధించి అర్జీలు అందించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ విలేకరులతో మాట్లాడుతూ మండలంలో వాడపాలెం రీ సర్వే పూర్తి కాగా గంటి, అవిడి, మందపల్లి, వానపల్లి ఖండ్రిగ గ్రామాల్లో 5,420 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి సర్వే పూర్తి కాగా గ్రౌండ్ వేలిడేషన్ జరుగుతుందన్నారు. బిళ్లకుర్రు, పలివెల, కొత్తపేట గ్రామాల్లో 8,312 ఎకరాల విస్తీర్ణ కాగా రీ సర్వే ప్రారంభ దశలో ఉందని. ఫీల్డ్ వర్క్ జరుగుతుండగా రైతుల నుంచి డాక్యుమెంట్స్ రావాల్సి ఉందన్నారు. రైతులు తమ భూమికి సంబంధించిన దస్తావేజులు, పట్టాదార్ పాస్‌బుక్, 1 బీ రికార్డు (సచివాలయం లేదా మ సేవ ద్వారా తీసుకోవాలి), ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్‌లకు సంబంధించిన జిరాక్స్‌లను, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోస్ సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, కార్యదర్శి వీవీ రామన్, వీఆర్‌ఓలు కె.వీరేంద్ర, దుర్గ, మహాలక్ష్మి, సుభాషిణి, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పునీత్ ఎంపిక


పునీతను అభినందిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు పెద్దలు

అంబాజీపేట: ఈ నెల 24వ తేదీన విజయవాడలో జరగబోయే పారిశ్రామిక వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం రాష్ట్రస్థాయి పోటీలకు గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న గుబ్బల పునీత్ ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎంఎస్ఎస్ కుమారి తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో పునీత్‌ను పలువురు శనివారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో ఈ నెల 17న జరిగిన పారిశ్రామిక వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమంలో రెంట్ ఫర్ కిచెన్ కుక్ యువర్ ఫుడ్ ప్రాజెక్ట్‌లో పునీత్ ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి ఎం.కమలకుమారి చేతుల మీదుగా పునీత్, గైడ్ టీచర్ ఎంఎస్ఎస్ కుమారి, ఎంఆర్పీ అప్పారి శశికుమార్ ప్రసంసా పత్రాన్ని, జ్ఞాపికను అందుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పునీత్‌ను సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎం.ఎం.శెట్టి, పీఏసీఎస్ చైర్మన్ ఎం.సూర్యనారాయణ, స్థానిక పెద్దలు రాయుడు షణ్ముఖ్, విత్తనాల శేఖర్, రాయుడు కృష్ణమహేష్, తదితరులు అభినందనలు తెలిపారు.